# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 36 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 20 మే 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


### పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ

# యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

**సీఎం ఆదేశాలు**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**

**సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షా సమావేశం**

**పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ**





**హైదరాబాద్, మే 19 (ప్రభాత ఉదయం)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆ జిల్లా సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు రేవంత్‌రెడ్డి కీలక సూచనలు చేశారు. వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తాం : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలన్నారు. నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం భరోసా ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీ కృష్ణ, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు హాజరయ్యారు. మా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు : పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తానని ఆనాడు కేసీఆర్ చెప్పి రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుపై రూ.25 కోట్లే ఖర్చు పెట్టారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ..మిగతా 2లో



### పాలమూరు ప్రాజెక్టులను

## పూర్తి చేయడమే లక్ష్యం

**కెసిఆర్ హయాంలో జరిగిన తపలను సరిదిద్దుతాం**

**అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, మే 19 (ప్రభాత ఉదయం)**

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు – రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తపదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెపకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెపకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

### భారత్‌లో తీవ్రమైన

## ఆర్థిక తుపాను రాబోతుంది

**రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ, మే 19 (ప్రభాత ఉదయం)**

భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్

# తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా!

**ఈ నెల 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన**

**ఈనెల 21న సచివాలయంలో మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని గతంలో నిర్ణయం**

**అదే రోజున కాళేశ్వరంలో సరస్వతీ నది అంత్యపుష్కరాలకు సీఎం హాజరయ్యే అవకాశం**

**మేడారం కేబినెట్ భేటీ తరహాలో యాదగిరిగుట్టలో సమావేశం**



**హైదరాబాద్, మే 19 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. ఈనెల 21కి బదులుగా ఈ నెల 23వ తేదీన యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల 21వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని గతంలో నిర్ణయించారు. అయితే ఎల్లుండి కాళేశ్వరంలో సరస్వతీ నదీ అంత్య పుష్కరాలు ప్రారంభం కానుంది. సీఎం, పలువురు మంత్రులు పుష్కరాలకు హాజయ్యే అవకాశం ఉన్నందున కేబినెట్ వాయిదా వేయాలని భావిస్తున్నారు. ఈనెల 23న యాదగిరిగుట్టలో వేద పాఠశాల, గోశాల శంకుస్థాపన తదితర కార్యక్రమాలు ..మిగతా 2లో

## నాసిక్ ఘటన మరువక ముందే

# మరో నెట్ వర్క్

**పది మంది నిందితుల అరెస్ట్... జిమ్‌లు సోషల్ మీడియాలో మహిళలతో పరిచయం**

**న్యూఢిల్లీ, మే 19 (ప్రభాత ఉదయం)**



నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటు చేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లోని మీర్జాపుర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం మీర్జాపుర్‌లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్ మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుంటుందని అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు.

# నీట్ యూజీ రీ టెస్ట్

**కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎగ్జామ్**

**సిటీ ప్రిఫరెన్స్ మార్చుకునేందుకు స్టూడెంట్స్‌కు ఛాన్స్**

**ప్రశ్నాపత్రం లీక్ కావడంలో రద్దైన నీట్ యూజీ పరీక్ష**

**జూన్ 21 మళ్లీ రీ ఎగ్జామ్- ఈ క్రమంలో అప్రమత్తమైన కేంద్ర సర్కార్**

**కట్టుదిట్టమైన, పటిష్ఠమైన భద్రతా మధ్య ఎగ్జామ్**

**న్యూఢిల్లీ, మే 19 (ప్రభాత ఉదయం)**




నీట్ యూజీ రీ-ఎగ్జామ్ సన్నాహాలను సమీక్షించేందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం దిల్లీలో ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ పరీక్షను కట్టుదిట్టమైన, పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్ల నడుమ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సమగ్రత, పారదర్శకత అవసరమని తెలిపారు. గత పరీక్షా ప్రక్రియలో గుర్తించిన అన్ని లోపాలను సరిదిద్దాలని, రీ-ఎగ్జామ్‌లో అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ..మిగతా 2లో



### విజయ్ ప్రభుత్వం

## కూలడం ఖాయం

**తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు**

**చెన్నై మే 19 (ప్రభాత ఉదయం)**

ప్రముఖ సినీ నటుడు విజరు నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎపడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజరు ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎపడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన ..మిగతా 2లో

# పటాన్‌చెరు నియోజకవర్గంలో ముమ్మరంగా సాగిన మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన

### ఒకేరోజు రూ.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ప్రతి మున్సిపాలిటీకి రూ.15 కోట్ల భారీ నిధుల విడుదల

**పటాన్ చెరు,మే 19( ప్రభాత ఉదయం):**

పటాన్‌చెరు నియోజకవర్గ సమగ్ర అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి నేడు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజలు వేలాదిగా తరలివచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మొత్తంగా నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.84 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. భానూర్‌లో రూ.8.30 కోట్ల వ్యయంతో విశాఖ పీడబ్ల్యూడీ రోడ్డు నుండి శంకరపల్లి నుండి పటాన్‌చెరు రోడ్డు వరకు కంచర్లగూడెం మీదుగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉ





స్మాన్‌నగర్ కేజీబీవీలో రూ.60.94 లక్షలు, జిన్నారం కేజీబీవీలో రూ.70.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేసి, సోలక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి... మాట్లాడుతూ1985లో స్వర్గీయ అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఈ ప్రాంతానికి బీడీఎల్, ఓడీఎఫ్ వంటి ప్రతిష్టాత్మక రక్షణ రంగ పరిశ్రమలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆమె సేవలను స్మరించుకుంటూ ఈ ప్రాంతంలో ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమన్నారు. భానూర్ కార్మికుల హౌసింగ్ సొసైటీకి స్థల కేటాయింపు చేపడతామని, పటాన్‌చెరు నుండి శంకర్‌పల్లి వరకు 100 ఫీట్ల రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో లేని విధంగా ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, జూన్ 2వ తేదీ నుండి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పటాన్‌చెరు అభివృద్ధికి, ముఖ్యంగా విద్యా , మౌలిక వసతుల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఒకేరోజు రూ.84 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి , స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



# కూకట్‌పల్లి ఎంకెఎన్ఆర్ గార్డెన్‌లో ఈనెల 25న బీఆర్ఎస్ భారీ కార్యకర్తల సమావేశం

### ముఖ్య అతిథిగా హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### ఫతేనగర్ డివిజన్ నుంచి భారీగా తరలిరావాలని మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**కూకట్‌పల్లి, మే 19 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ శక్తి ప్రదర్శనకు వేదిక సిద్ధమవుతోంది. ఈనెల 25వ తేదీన కూకట్‌పల్లిలోని ఎంకె ఎన్ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసమావేశంలో 2026 అంశంతో పాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలు, క్షేత్రస్థాయి బలోపేతం వంటి కీలక అంశాలపై విస్తృత చర్చ జరగనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అధ్యక్షతన డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా హాజరవుతున్న ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకమైందని పేర్కొన్నారు. ఫతేనగర్ డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని, పార్టీ ఆదేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కార్యకర్తలేనని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించిన పండాల సతీష్ గౌడ్, ఈనెల 25న జరిగే సమావేశానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై కేటీఆర్ సందేశాన్ని వినాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుందరయ్య ఆచరణలో పని చెయ్యడమే సుందరయ్య కీ నిజమైన నివాళి

### సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్

**కూకట్ పల్లి, మే 19 (ప్రభాత ఉదయం)**



పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందు తీసుకెళ్దాం అని సిపిఎం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం బాలానగర్, కూకట్ పల్లి మండలం ఆధ్వర్యంలో శ్రీ శ్రీనగర్ ఆఫీసులో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం లో సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, కూకట్ పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ పాల్గొని మాట్లాడుతూ హైదర్ అలీ ఖాన్ సుందరయ్య ని గుర్తించి పార్టీలోకి తీసుకొచ్చారని ఆ తర్వాత అమిర్ హైదర్ అలీ ఖాన్ జైలుకెళ్లాక సుందరయ్య దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్వహించడంలో కీలకపాత్ర వహించారని తెలిపారు. గొప్ప పార్లమెంటేరియన్ గా శాసనసభ పక్ష నేతగా పనిచేశారని పార్లమెంట్కు అంగు,ఆర్భాటాలు లేకుండా సైకిల్ పైనే వెళ్లారని పార్లమెంట్లు అనేక విశ్లేషణలు చేశారని, ఇప్పుడు ఉన్నటువంటి పాలకులు అంగుళాల పాటలతో రాజకీయాలు చేస్తున్నారని, కానీ సుందరయ్య నిరాహారతో నా జీవితాంతం ప్రజల కోసం సేవ చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై సామాన్యులపై రోజురోజుకు అనేక భారాలు మోపుతుందని పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాలుంటాయని కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోర్లను తీసుకొచ్చి కార్మికులకు అనేక నష్టాలకు గురి చేస్తున్నారని అన్నారు. కులాలను మతాలను ఉపయోగించి ప్రజల్ని చీల్చి ఎన్నికల్లో లబ్ధి పొందుతున్నారని తెలిపారు కావున ఈ విధానాలపై రాబోవు కాలంలో ప్రజలందరిని కలుపుకొని ఐక్య పోరాటాలు చేయాల్సి వస్తుందని ఇదే సుందరయ్య కి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.సత్తయ్య, భీమేశ్వరరావు, ఏ.విజయ, కే కృష్ణ నాయక్, శ్రీను, రాములు బోరెల్లి, సాయి రెడ్డి, జోగారావు, కమల్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ ప్రభుత్వం

# కూలడం ఖాయం

మొదటి పేజీ తరువాయి...

డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోకసేభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమితాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచించారు. ఒకపడు మనం టీ దుకాణాల్లో మాట్లాడిన రాజకీయాలను ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాలని సూచించారు.

# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని గుర్తు చేశారు. కాళేశ్వరం పూర్తి చేసినట్లు పాలమూరు ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డికి కావాల్సిన 90 టీఎంసీలు బీఆర్ఎస్ తేలేకపోయిందని, తాము తెచ్చి తీరుతామని అన్నారు. పాలమూరుపై బీఆర్ఎస్‌ది సవతి తల్లి ప్రేమ అని అన్నారు. సమీక్ష అనంతరం ఈ మేరకు మాట్లాడారు.సమావేశంలో మంత్రులు : పాలమూరు-రంగారెడ్డి పూర్తి కావాలంటే రూ.లక్ష కోట్లు కావొచ్చని జూపల్లి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల లభ్యత దృష్ట్యా గ్రావిటీ ద్వారా నీళ్లు తేవచ్చని, పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీల నికర జలాలు సాధించి తీరుతామని తెలిపారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను బీఆర్ఎస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్న ఆయన, కృష్ణా జలాల్లో తెలంగాణకు 62 శాతం వాటాపై హక్కు ఉందని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ, వేల టీఎంసీలు తీసుకెళ్లిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డికి త్వరలోనే నీటి కేటాయింపులు సాధిస్తామని, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎంను కలిశామని చెప్పారు. పాలమూరుకు అధిక నిధులు కేటాయించాలని సీఎంను కోరామన్న ఆయన, ప్రాజెక్టుల పూర్తికి అధిక నిధులు కేటాయించేలా ఒత్తిడి తెస్తామన్నారు.

# తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా!

మొదటి పేజీ తరువాయి...

ఉన్నందున అక్కడే మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ఆలోచిస్తున్నారు. గతంలో సమ్మక్క సారక్క జాతర సందర్భంగా మేడారంలో కేబినెట్ సమావేశం నిర్వహించారు. వేద పాఠశాలకు సీఎం శంకుస్థాపన : ఈ నెల 23వ తేదీన యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఈఓ భవాని పేర్కొన్నారు. అదేరోజున యాదగిరిగుట్టలోని టెంపుల్ సిటీలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం : అదే రోజు కొండపైన నిర్మించనున్న కళ్యాణ మండపం, దీక్షపరుల సదనం, మెట్ల మార్గానికి పై కప్పు, ప్రధానాలయం వాయువ్య దిశలో మాడ వీధుల్లోకి వెళ్లడానికి నిర్మించే మెట్ల మార్గానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు : 22న యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి రానున్నారని అన్నారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు నరసింహ స్వామి దర్శించుకుంటారని తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం సాయంత్రం 6 గంటల సమయంలో కళావేధిక ప్రాంతానికి చేరుకుంటారని చెప్పారు. భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తర్వాత 32 మంది ప్రసిద్ధ వేదపండితులతో చదుర్వేద పారాయణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆపై కంచి పీఠాధిపతులు అనుగ్రహం బాషణం చేయనున్నారని చెప్పారు.

"యాదగిరి గుట్ట టెంపుల్ సిటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి రానున్నారు. ఇదే రోజున ఆలయానికి సంబంధించిన 4 అభివృద్ధి పనులు కళ్యాణ మండపం, దీక్షపరుల సదనం, మెట్ల మార్గానికి పై కప్పు, పీఆర్‌వో ఆఫీసుకు ఎదురుగా మాడ వీధుల్లోకి వెళ్లడానికి నూతన మెట్ల మార్గాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఆరోజున రూ.100 విలువైన పనులకు శ్రీకారం చుట్టనున్నారు" - భవాని శంకర్, యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఈఓ

# నీట్ యూజీ రీ టెస్ట్

మొదటి పేజీ తరువాయి...

చూసుకోవాలని అధికారులకు సూచించారు. 2026 నీట్ యూజీ పేపర్ లీకైన అయిన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ ఈ ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా జూన్ 21న పెన్ అండ్ పేపర్ విధానంలో నీట్ యూజీ రీ-ఎగ్జామ్ జరుగుతుందని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ప్రతి రాష్ట్రంలో పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని, జిల్లా యంత్రాంగాలు, పోలీసు అధికారులతో సన్నిహితంగా సమన్వయం చేసుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, నిఘా విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. భద్రతా నియమావళి, పరీక్షా ఏర్పాట్ల అమలు సజావుగా జరిగేలా చూసేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. భద్రతా చర్యలతో పాటు విద్యార్థుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని నొక్కిచెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఎగ్జామ్ సెంటర్లకు రవాణా సౌకర్యం, కేంద్రాల్లో తాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, మే 19 (ప్రభాత ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్ 2 కాలనీ లోని నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టిగౌడ్, నాగేష్ గౌడ్, అభిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# పెంచిన డీజిల్, పెట్రోల్, ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలి

### రైతుల పట్ల, మధ్యతరగతి కుటుంబాల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి మారాలికొండాపురం బి ఆర్ ఎస్ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి

### కావిలి గోపి, గోనెల స్వామి, యుగంధర్ నాయుడు,

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే19(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలం, కొండాపురం ప్రధాన రహదారిపై కాళీ ఎరువుల బస్తాలు గ్యాస్ స్టవ్ తో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు .పెంచిన పెట్రోల్, డీజిల్, రైతుల ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని, ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి అవసరమైన డి ఏపి యూరియా కాంప్లెక్స్ రకాల ఎరువులను కొరత లేకుండా సరఫరా చేయాలి ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి డిమాండ్.యుద్ధం సాకు చూపి ఎరువుల కంపెనీలు ఎరువుల ధరలు పెంచి అన్నదాతల నడ్డి విరుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్- అమెరికా ఇజ్రాయిల్ ల యుద్ధం ప్రభావంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగితే కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ ఇవ్వాలి తప్ప ధరలు పెంచడానికి అనుమతినివ్వడం రైతులను నిలువునా ముంచడమే తప్ప ఇంకొకటి కాదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు బోనస్ హామీలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా రాక పెట్టుబడి పెట్టలేక అప్పులపాలవుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినైన స్పర్శ లేదని విమర్శించారు. ప్రభుత్వ సహకార ప్రవేట్ రంగాలలోని కంపెనీలు ఎరువుల ధరలు పెంచకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు మూడు రూపాయలపైన పెంచాయని, మరోసారి దశల వారి పది రూపాయల వరకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న ఈ సీజన్లో ఇప్పుడు ఎరువుల ధరలు పెరగడం వల్ల రైతును వ్యవసాయం నుండి బేధఖల్ చేయడమే అని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండగానే ఎరువుల ధరలు పెంచడం రైతాంగానికి మోయలేని భారమవుతుందన్నారు. ఒక్కో బస్తాకు రూ.125 నుండి 300లు పెంపుదల వలన రాష్ట్ర రైతాంగంపై రూ.800 కోట్ల భారం పడనున్నదని విచారం వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణాల వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఎరువుల ధరలు పెంచకుండా, బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే ఎరువుల సబ్సిడీని పెంచి, ఎరువుల ధరలు పెరగకుండా చూడాలని వారు కోరారు.



# కొండపల్లిలో 'పోక్సో' చట్టంపై న్యాయ అవగాహన సదస్సు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(ప్రభాత ఉదయం):**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'జాగృతి పథకం -- 2025' కింద "సురక్షిత బాల్యం -- సురక్షిత భవిష్యత్" అనే అంశంపై మంగళవారం కొండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోక్సో (గూజూూ) చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారుల హక్కుల పరిరక్షణ, బాలలపై జరిగే లైంగిక వేధింపుల నివారణపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం.ఈ సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి వి. రాజేందర్ మాట్లాడుతూ, పిల్లల భద్రతకు సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. వేధింపులకు గురవుతున్న పిల్లల విషయంలో ఆలస్యం చేయకుండా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులు భయం వీడి తమ సమస్యలను తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు బి. శ్రీనివాసులు, డి. లక్ష్మణ స్వామి, ప్యానెల్ అడ్వకేట్ వేంకటేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి దర్శల్లి, ఏ.ఈ.ఓ అనూష, పాఠశాల విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రపంచంలో నివాసం ఉంటున్న ప్రజలందరి కోసం ప్రార్థనలు చేయాలి



బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ డాక్టర్ కె వి పాల్, తర్జుమా చేస్తున్న పాస్టర్ డానియల్ ప్రవీణ్



పాస్టర్ క్రిస్టఫర్ కుటుంబ సభ్యులను సన్మానించి నూతన వస్త్రాలను బహుకరిస్తున్న సిస్టర్ లీనా కుమారి కుటుంబ సభ్యులు



పాట పాడుతున్న కుమారి శ్రేష్ట ఆరాధ్య

## రెవరెండ్ డాక్టర్ కేవీ పాల్

**బుద్వేల్, మే 19 (ప్రభాత ఉదయం) :**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 800 కోట్ల జనాభ కోసం ప్రార్థనలు చేయాల్సిన అవసరం ఉందని నేషనల్ ప్రేయర్ మూవ్ మెంట్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ కేవీ పాల్ అన్నారు. ఉప్పర్ పల్లి , చింతల్మెట్ మార్గంలోని రాక్ చర్చిలో మంగళవారం ఫెలోషిప్ కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్ అధ్యక్షతన పాస్టర్ క్రిష్టపర్ రాజ్ సహకారంతో రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రెవరెండ్ డాక్టర్ కేవీ పాల్ మాట్లాడుతూ, ప్రతి గృహం యేసయ్య ను ప్రార్ధించే గృహంగా ఉండాలన్నారు. అప్పుడు ఆయన ఆత్మ ఆ గృహంలో నివాసం ఉండే వారిపై కుమ్మరించబడుతుందన్నారు. ఈ నెల 24న ప్రపంచ పెంతుకోస్తు దినాన్ని నిర్వహించడం జరుగుందని తెలిపారు. ఆ రోజు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో, జిల్లాలలో గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రార్థనలను విజయవంతం చేయడానికి ప్రతి క్రైస్తవుడు ముందుకు రావాలన్నారు. గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్ సందర్భంగా దేశం లోని 145 కోట్లు, హైదరాబాద్ నగరంలో ఉన్న 1 . 35 కోట్ల ప్రజల కోసం ప్రార్థించడం జరుగుతుందన్నారు.



సేవకులు

రాజేంద్రనగర్ మండలానికి సంబందించి ఈ నెల 24 సాయంత్రం 6 గంటలకు ఉప్పర్ పల్లి లోని రాక్ చర్చిలో ప్రార్థనలు ఉంటాయన్నారు. ప్రతి సంఘం నుంచి 10 మంది వరకు వచ్చి ప్రార్థనలు చేయాలన్నారు.రెవరెండ్ డాక్టర్ కేవీ పాల్ చెప్పిన బైబిల్ సందేశాలను పాస్టర్ డానియేల్ ప్రవీణ్ తెలుగు లో తర్జుమా చేశారు. ప్రత్యేక అథిధులుగా గుంటురు ప్రత్తిపాడు నుంచి వచ్చిన పాస్టర్ నెలటూరి లూథర్ బాబు రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ తో తనకున్న అనుబంధాన్ని వివరించారు. ప్రతి రోజు ఉదయకాలం జరిగే ప్రార్థన వీరుల సమావేశంలో తాను పాల్గొంటున్నానని, తద్వారా ఈ ఫెలోషిప్ లో ఒక సభ్యునిగా తాను ఉన్నానన్నారు. సమావేశంలో రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ కె సుందర్ పాల్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రణీత్ బాబు, ఉపాధ్యక్షులు పాస్టర్ ప్రమోద్ కుమార్, సంయుక్త కార్యదర్శి పాస్టర్ సోమారం రాజ్ కుమార్, కమిటీ సభ్యులు రెవరెండ్ ఎం విజయ్ కుమార్, పాస్టర్ గుంటి డానియేల్, పాస్టర్ యేసు రత్నం, బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేలు లు పాల్గొన్నారు.

**కవిత లతో ఆకట్టుకున్న పాస్టర్ క్రిష్టఫర్ రాజ్ :**

మంగళవారం జరిగిన పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశానికి ఆతీధ్యం ఇచ్చిన పాస్టర్ క్రిష్టఫర్ రాజ్ తన కవిత లతో సభికులను ఆకట్టుకున్నారు. దైవ సేవకులైన వారు, వారి కుటుంబ సభ్యులు యేసయ్య లో ఏ విదంగా ఉండాలో వివరించారు. పాస్టర్ క్రిష్టఫర్ రాజ్ కుటుంబ సభ్యులను పాస్టర్ సీహెచ్ లీనా కుమారి కుటుంబ సభ్యులు సన్మానించి నూతన వస్త్రాలు బహుకరించారు. సమావేశంలో చిన్నారి శ్రేష్ట ఆరాధ్య పాడిన క్రైస్తవ గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. సమావేశంలో రాజేంద్రనగర్ మండల పాస్టరమ్మల ఫెలోషిప్ ఉపాధ్యక్షులురాలు సిస్టర్ ఎస్ యేసుమణి, ప్రధాన కార్యదర్శి సిస్టర్ స్వర్ణరాజరాం లతో పాటు సీనియర్ పాస్టర్లు రెవరెండ్ థామస్ కురియన్, రెవరెండ్ ఎన్ రాజరాం, పాస్టర్ జేపీ పాల్, రెవరెండ్ వి సువర్ణరాజు, పాస్టర్ పాల్మకుల మధు, తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు వినియోగం..

**కృత్రిమ మేధతో లాభాల పంట.! అన్నదాతకు అండగా కృత్రిమ మేధ..**

**దిగుబడుల పెంపే లక్ష్యం.. రెయిస్ ప్రాజెక్ట్ స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్**

**రాజేంద్రనగర్,మే19(ప్రభాత ఉదయం)**

ఆధునిక వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు వినియోగం రోజురోజుకీ విస్తరిస్తోంది.ముఖ్యంగా పంటల్లో కనిపించే సమస్యలను చిత్రాల ఆధారంగా గుర్తించి,తక్షణ పరిష్కార సూచనలు అందించడంలో ఏఐ ఆధారిత నమూనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.ఈ నేపథ్యంలో రైతులకు సాంకేతిక సేవలను సమర్థవంతంగా చేరవేసేందుకు రూపొందించిన “రైస్ ఏఐ స్ట్రెస్ ఎవాల్యుయేటర్” ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది.ఈ నేపథ్యంలో మంగళవారం భారతీయ వరి పరిశోధన సంస్థ,హైదరాబాద్‌లో రెయిస్ ప్రాజెక్ట్ స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం.సుందరం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విద్యా విభాగం మాజీ డైరెక్టర్ డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎం.సుందరం మాట్లాడుతూ...రైతులకు సకాలంలో సరైన సలహాలు అందించేందుకు డిజిటల్ టెక్నాలజీల వినియోగం అత్యంత అవసరమని తెలిపారు.రెయిస్ మొబైల్ యాప్ ద్వారా వరి పంటలో కనిపించే సమస్యలను సులభంగా గుర్తించి,తగిన నిర్వహణ సూచనలు అందించవచ్చని వివరించారు.రైతులు యాప్‌లో అప్‌లోడ్ చేసే చిత్రాలకు జియోట్యాగింగ్ సదుపాయం కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు.దీని ద్వారా ఏ ప్రాంతంలో ఏ తెగులు,పురుగు సమస్య ఎక్కువగా నమోదవుతుందో గుర్తించవచ్చని పేర్కొన్నారు.తద్వారా వచ్చే పంట సీజన్‌లో ఆయా ప్రాంతాల రైతులకు ముందస్తు హెచ్చరికలు,తగిన నిర్వహణ సూచనలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు.ముఖ్యఅతిథి డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ...వ్యవసాయ విస్తరణలో స్మార్ట్ టూల్స్ పాత్ర రోజురోజుకు పెరుగుతోందని,ఈ తరహా యాప్‌లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారతాయని అభిప్రాయపడ్డారు.అలాగే రెయిస్ యాప్‌ను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు పలు విలువైన సూచనలు చేశారు.ముఖ్యంగా రైతులకు అందించే తుది సలహాలు స్థానిక రైతుల భాషలో ఉండాలని,యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేసే ప్రక్రియను మరింత సులభతరం చేయాలని సూచించారు.అదేవిధంగా వివిధ వ్యవసాయ వాతావరణ మండలాల ఆధారంగా యాప్ పనితీరును ధృవీకరించడం,అన్ని రకాల మొబైల్ ఫోన్లలో యాప్ సులభంగా పనిచేసే విధంగా రూపొందించడం,రైతులకు అనుకూలమైన వినియోగదారు స్నేహపూర్వక ఇంటర్‌ఫేస్ కల్పించడం అవసరమని తెలిపారు.అలాగే యాప్‌లో యాంకర్ ఆధారిత చాట్‌బాక్స్ ద్వారా రైతుల ప్రశ్నలకు మరింత ఖచ్చితమైన సమాధానాలు అందించే విధంగా ధృవీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు.ప్రాజెక్ట్ బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు.ఈ బ్రోచర్ ద్వారా ప్రాజెక్ట్ లక్ష్యాలు,యాప్ ముఖ్య లక్షణాలు,రైతులకు అందించే సేవల వివరాలను తెలియజేశారు.డాక్టర్ శైలజతో పాటు రెయిస్ ప్రాజెక్ట్ శాస్త్రవేత్తల బృందం యాప్ ప్రధాన ప్రత్యేకతలు,పనితీరు,వినియోగ విధానాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రెయిస్ యాప్ ప్రదర్శన,వినియోగదారుల అభిప్రాయాల సేకరణ,ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు.ఈ కార్యక్రమం రైతు సమాజానికి ఆధునిక సాంకేతికతను చేరువ చేసి,పంట సమస్యలను ముందుగానే గుర్తించి సరైన నిర్వహణ చర్యలు చేపట్టేందుకు దోహదపడనుందన్నారు.




మైలార్ దేవుపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆకస్మిక తనిఖీలు చేసిన రంగారెడ్డి జిల్లా డీ ఎం హెచ్ ఓ డాక్టర్ డి స్వర్ణ కుమారి

# మైలార్దేవుపల్లి పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ ఓ ఆకస్మిక తనిఖీలు

**బుద్వేల్, మే 19 (ప్రభాత ఉదయం)**



మైలావుపల్లి పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణీ డాక్టర్ డి స్వర్ణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను, సిబ్బంది హాజరు పట్టికను, హాస్పిటల్ లోని బెడ్లను, మెడిసిన్ ఎక్స్పైరీ డేట్లను, హాస్పిటల్ ఆవరణలో ఉన్న పరిశుభ్రత ను చూసారు. గర్భిణీ లకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా.. అని వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల వైద్య సేవలను పరిశీలించారు. ఆ సందర్భంగా డాక్టర్ డి స్వర్ణకుమారి మాట్లాడుతూ, ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా క్లీనిక్ ను ఏర్పాటు చేయాలని, ప్రతి మహిళ కు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత ఉన్న వారికి సరైన వైద్యం అం దించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. వారు వేచి ఉండే ప్రాం తంలో కూర్చోవడానికి కుర్చీలు, త్రాగడానికి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సేవాభావంతో పనిచేయాలన్నారు.

# భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

**మొదటి పేజీ తరువాయి...**

వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు.

**ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు**

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

**‘రైతులు నాశనమవుతారు- పేదలు తుడిచిపెట్టుకుపోతారు’**

“ప్రజలు మేల్కొని రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి. మీరు ఈ ప్రభుత్వాన్ని మార్చకపోతే ఈ దేశం మనుగడ సాగించదు. ఎంజీఎన్ఆర్ఈజీఏ రద్దు చేస్తారు. రైతులు నాశనమవుతారు. పేదలు తుడిచిపెట్టుకుపోతారు. కానీ మోదీ, అమిత్ షా సహా దేశ నాయకులందరూ అంబానీ ఇంట్లో జరిగిన పెళ్లికి హాజరవుతుంటారు. గతంలో ప్రజలు తమ ఇంటి పొదుపును తమ ఇళ్లలోనే ఉంచుకునేవారు. అయితే, ఇప్పుడు మోదీ ఆ డబ్బును మీ జేబుల నుంచి దోచుకుని అదానీ, అంబానీలకు, తన అనుచరులకు అప్పగించారు. వారు జీఎస్టీ పేరుతో నిధులను పక్కదారి పట్టిస్తున్నారు.” అని రాహుల్ గాంధీ అన్నారు.

# కవాడిగూడలో దారుణం.. భార్యను చంపిన భర్త

**అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయిన భర్త**

**రాజేంద్రనగర్,మే19(ప్రభాత ఉదయం)**



కవాడిగూడలో దారుణం జరిగింది.భార్య దెబొరా (32)ను కత్తితో పొడిచిహత్య చేశాడో కిరాతక భర్త..కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో ఓస్పా సెంటర్లో దెబొర పనిచేస్తున్నారు.ఎప్పటిలాగేమంగళవారం కూడా ఆమె పనికి వెళ్లింది.ఈక్రమంలో అక్కడికి వెళ్లిన భర్త..ఆమెపై కత్తితోదాడి చేసి పరారయ్యాడు.ఈ దాడిలో ఆమెఅక్కడికక్కడే మృతి చెందింది.సమాచారం అందుకున్న వెంటనే గాంధీనగర్ పోలీసులు,క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు.సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.అనంతరం నిందితుడు అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. కుటుంబ కలహాలే హత్యకు కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు.

# మాయగాడి మ్యాట్రిమోనీ మాయాజాలం.. పెళ్లి పేరిట వల.. గోవా క్యాసినోల్లో జలసా!

**తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు.. ఘరానా మోసగాడు మందా వెంకట కామేషును అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు!**

**సైబరాబాద్ , మే 19, (ప్రభాత ఉదయం)**



మ్యాట్రిమోనీ మోసగొడు మంద వెంకట కామేసు..

అతనో హైటెక్ కిలాడీ.. అందమైన మాటలతో అమాయక మహిళల మనసు దోచుకుంటాడు. కోటీశ్వరుడినంటూ నకిలీ ప్రొఫైళ్లతో వల విసురుతాడు. పెళ్లి పీటల దాకా తీసుకెళ్తానంటూ నమ్మించి లక్షల రూపాయలు గుంజుతాడు. చివరకు ఆ సొమ్ముతో గోవా క్యాసినోల్లో జల్సాలు చేస్తాడు. ఇలా తెలుగు రాష్ట్రాల్లోని ఎంతోమంది మహిళల జీవితాలతో ఆడుకున్న ఘరానా మోసగాడి ఆట కట్టించారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రెండు రాష్ట్రాల్లో దాదాపు 20కి పైగా క్రిమినల్ కేసులు ఉన్న ఈ మాయగాడిని చాకచక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**ప్రొఫైల్స్ నకిలీ.. కలరింగ్ అసలీ!**

పోలీసుల విచారణలో తేలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, ఉండ్రాజవరం గ్రామానికి చెందిన మందా వెంకట కామేష అనే వ్యక్తి దందాకు తెరలేపాడు. శ్రమించకుండా సులు విలాసవంతమైన జీవితాన్ని గడపడం కోసం మ్యాట్రిమోనీ యాప్స్‌ను తన వేదికగా మార్చుకున్నాడు. తెలుగు మ్యాట్రిమోనీ, రెడ్డి మ్యాట్రిమోనీ, బ్రాహ్మణ మ్యాట్రిమోనీ, కమ్మ మ్యాట్రిమోనీ వంటి ప్రముఖ ప్లాట్‌ఫామ్‌లలో విభిన్నమైన నకిలీ ఐడెంటిటీలతో ప్రొఫైళ్లను సృష్టించాడు. తాను సమాజంలో ఎంతో ఉన్నతమైన స్థానంలో ఉన్నానని, కోట్లకు అధిపతినని నమ్మించేలా లగ్జరీ కలరింగ్ ఇచ్చేవాడు.


**నమ్మించి నట్టేట ముంచాడు!**

ఈ మాయగాడి మాయమాటలు, ఆకర్షణీయమైన ప్రొఫైళ్లను చూసి నిజమేనని నమ్మిన మహిళలను టార్గెట్ చేసేవాడు. మొదట వాట్సాప్ కాల్స్, ఇన్‌స్టాగ్రామ్ చాట్స్‌తో పరిచయం పెంచుకోవడం అతి తక్కువ కాలంలోనే వారి నమ్మకాన్ని, ప్రేమను చూరగొనడం. ఆపై అసలు రంగు బయటపెట్టడం. సరిగ్గా నమ్మకం కుదిరింది అనుకున్న సమయంలో రకరకాల ఎమోషనల్ డ్రామాలకు తెరలేపేవాడు. బిజినెస్‌లో అత్యవసరంగా డబ్బు కావాలి, హెల్త్ మెడికల్ ఎమర్జెన్సీ అంటూ బాధితుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజడమే కాకుండా, వారి క్రెడిట్ కార్డు వివరాలు, బ్యాంక్ క్రెడెన్షియల్స్, ఓటీపీలను కూడా దక్కించుకునేవాడు. ఇలా మహిళలను మోసం చేసి దోచుకున్న సొమ్మునంతటినీ గోవాలోని క్యాసినోలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో విచ్చలవిడిగా తగలేసేవాడని పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పక్కా స్కెచ్‌తో అదుపులోకి తీసుకున్నారు. పెళ్లిళ్ల పేరిట జరుగుతున్న ఇలాంటి డిజిటల్ మోసాల పట్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. సాయి మనోహర్ హెచ్చరించారు. మ్యాట్రిమోనీ లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కనిపించే ఆకర్షణీయమైన ఫొటోలు, లగ్జరీ లైఫ్‌స్టైల్, పెద్ద ఉద్యోగాల వివరాలను గుడ్డిగా నమ్మొద్దని సూచించారు. పరిచయం ఉన్నవారైనా, లేక కొత్తవారైనా ఎవరికీ మీ బ్యాంక్ ఖాతా వివరాలు, క్రెడిట్ డెబిట్ కార్డుల సమాచారం, ముఖ్యంగా ఓటీపీ లను ఎట్టిపరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దు హెచ్చరించారు. సంబంధం ఖాయం చేసుకునే ముందు సదరు వ్యక్తి ప్రవర్తన, ఉద్యోగం, కుటుంబ నేపథ్యాన్ని వ్యక్తిగతంగా లోతుగా వెరిఫై చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా మిమ్మల్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మోసం చేయడానికి ప్రయత్నిస్తే క్షణం కూడా ఆలస్యం చేయకుండా సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సైబర్ క్రై డీసీపీ వివరించారు.

# బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ యాదవ్

**శుభాకాంక్షలు తెలియచేసిన బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయికుమార్**

**కూకట్ పల్లి, మే 19 (ప్రభాత ఉదయం)**




భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ యాదవ్ ని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లంగటి నరేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శి కల్యాణిదుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు శ్రీహరి యాదవ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకరావడమే తమ లక్ష్యమని తెలియచేస్తూ, బీసీ ల ఐక్యత కోసం పోరాడుతూ, రాష్ట్రంలో బీజేపీ అధిష్టానం చెప్పినట్టు బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేస్తామని తెలియచేశారు. అలాగే తనకు శుభాకాంక్షలు తెలియచేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలును సజావుగా నిర్వహించాలి

**ఇప్పటికే మొక్కజొన్న కొనుగోలు 70 శాతం పూర్తి.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(ప్రభాత ఉదయం)**





మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి ఉండకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన నిర్వహించాలని, ఇప్పటికే జిల్లాలో 70 శాతం కొనుగోలు పూర్తయిందని, మిగిలిన మక్కలను వచ్చే మూడు రోజులలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్న భారీగా రావడంతో మార్కెట్ యార్డ్ పరిసరాల్లో ఉంచిన ధాన్యాన్ని కలెక్టర్ తిరిగి పరిశీలించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా షెడ్లలో కాకుండా షెడ్లు సరిపోక బహిరంగ ప్రదేశంలో ఉంచిన మొక్కజొన్నను ముందుగా తూకం చేయాలని ఆదేశించారు. లారీల కొరతను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ గోదాములు సరిపోనందున ప్రైవేటు గోదాముల్లోనూ మొక్కజొన్నను నిలువ ఉంచాలని సూచించారు. ప్రస్తుతం హమాలీల కొరత పరిష్కారమైనందున ఇబ్బంది లేదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పంట కొనుగోలుకు సంబంధించి రైతుల ధ్రువీకరణ పత్రాలను, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడారు.అనంతరం జిల్లాలోని ఎనిమిది మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, మార్క్ఫెడ్ డిఎం చంద్రమౌళి, డీఏవో వీరప్ప, డిపిఓ శ్రీకాంత్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, గద్వాల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్, గద్వాల మండల వ్యవసాయాధికారి ప్రతాప్ కుమార్, తహసిల్దార్ హరికృష్ణ, పిఎసిఎస్ ఇన్చార్జి సీఈవో రాజు, తదితరులున్నారు.





# నిరాడంబరుడు ఆదర్శవాది కామ్రేడ్ సుందరయ్య

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(ప్రభాత ఉదయం):**

నిరాడంబరుడు,ఆదర్శవాది కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు సంఘటీత పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటయు కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పార్లమెంటు లో తొలి ప్రతిపక్ష నేత. నిరాడంబరుడు ఆదర్శవాది కామ్రేడ్ సుందరయ్య స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలనారు . కేంద్ర ప్రభుత్వం సమస్యకు అసలు కారణం చెప్పకుండా ప్రజలను ఆర్థిక సంక్షోభాలకు సిద్ధంగా ఉండమని చెప్పడం విడ్డూరమన్నారు. పాలకులకు నిజంగా పొదుపు మీద నమ్మకం ఉంటే కొద్దిమంది బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు చేస్తున్న విచ్చలవిడి ఖర్చులను ఎందుకు నిరోధించడం లేదని ప్రశ్నించారు. పొదుపు పాలకుల కోసం కాకూడదని, పొదుపు ప్రకృతి కోసం కావాలని సుందరయ్య నుండి నేర్చుకోవాలని అన్నారు. దేశంలో పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలకు కారణం అమెరికా సామ్రాజ్యవాద విధానాలే కారణమని కేంద్ర ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న చమురు సంక్షోభానికి కారణం దుబారా వలన ఏర్పడింది కాదని, దీనికి కారణం పశ్చిమ ఆసియా లో అమెరికా సామ్రాజ్యవాదులు ఇజ్రాయిల్ తో కలిసి ఇరాన్ పై చేస్తున్న దాడులు కారణం అన్నారు. నాడు కుల,మత ప్రాంతీయ విద్వేషాలకు వ్యతిరేకంగా సిద్ధాంతాలను పాటిస్తే, నేడు కులం మతం బందు ప్రీతితో ఆడపిల్లలపై అఘాయిత్యాలు సైతం వెనుక వేసుకొస్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. సుందరయ్య స్ఫూర్తితో నేటి యువత సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహా, నాయకులు తిరుపతన్న, లక్ష్మన్న, బాలకృష్ణ రామక్రిష్ణ రంగన్న రామాంజనేయులు,విష్ణు, కళ్యాణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలతో ఏ రంగంలోనైనా రాణించవచ్చు


**ఉపాధి శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలి.**

**యూత్ వీక్ సెలబ్రేషన్స్ లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(ప్రభాత ఉదయం):**



యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని, ప్రభుత్వం నిర్వహించే ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వీక్ సెలబ్రేషన్స్ మంగళవారం గద్వాల ఏటిసి లో విద్యార్థులకు కెరీర్, స్కిల్ డెవలప్మెంట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటిసి కేంద్రంలో అత్యాధునిక పరికరాలతో వివిధ కోర్సుల్లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు యువత సృజనాత్మకతో ఇన్నోవేటివ్ గా ఆలోచించేందుకు సహకరిస్తాయన్నారు. పరిశ్రమలు, ఎస్సీ సంక్షేమ, మత్స్య శాఖలు, బ్యాంకింగ్, తదితర రంగాలు సొంతంగా వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడతాయన్నారు. పీఎం ఈజిపి, ముద్ర, విశ్వకర్మ వంటి అనేక పథకాలనువినియోగించుకొని బ్యాంకుల ద్వారా రుణాలనుపొందవచ్చన్నారు. యువత కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే స్టేజ్ ఫియర్ ఉండదని, ఇంటర్వ్యూలలోను ధైర్యంగామాట్లాడవచ్చన్నారు. హిందీ, ఆంగ్ల భాషలు నేర్చుకుంటే ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉద్యోగాలుపొందవచ్చన్నారు. జపనీస్, జర్మన్ వంటి భాషలు నేర్చుకునేందుకు ఆన్ లైన్ లొ అవకాశాలు ఉన్నాయని తద్వారా ఓవర్సీస్ లోనూ ఉ ద్యోగాలుపొందవచ్చన్నారు. సొంత ప్రాంతాల్లోనే ఉద్యోగాలు రావాలని ఖాళీగా ఉండకుండా యువత ఎక్కడికెళ్లినా తమ రంగాల్లో రాణించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తమ తల్లిదండ్రులు చేసే వృత్తి కంటే యువత ఇంకా ఉత్తమంగా రాణించేందుకు క్రమశిక్షణ, నైపుణ్య అభివృద్ధితో తమ కెరీర్ ను గొప్పగామలుచుకోవాలన్నారు. అనంతరం అలంపూర్ లోని పర్యాటక శాఖ దర్శనీయ స్థలాలపై ఆర్కియాలజీ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన బ్రోచర్స్ ను జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. అలాగే ఏటీసీలో విద్యార్థులకు వివిధ కోర్సులు నేర్పించడానికి వినియోగించే యంత్ర పరికరాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, పర్యాటకశాఖ ఏడి నాగలక్ష్మి, జిల్లా ఉపాధి కల్పనాధికారి చరణ్ దీప్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, మత్స్యశాఖ అధికారి షకీలా భాను, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**జోగులాంబ గద్వాల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్ల ఎంపిక**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19 (ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్లో భాగంగా మంగళవారం గద్వాలలోని ఇండోర్ స్టేడియంలో అండర్-12, అండర్-14, అండర్-16 కేటగిరీలలో ప్రతి విభాగం నుండి ప్రాథమికంగా 25 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శరత్ కుమార్, సెక్రటరీ శ్రీనివాసులు, మరియు కోచ్ లు తెలిపారు. వీరికి అంతర్గత మ్యాచ్లు నిర్వహించి, చివరికి ఒక్కో విభాగం నుండి 18 మందిని తుది జట్లుగా (ఫ్రతీశీమ్ఖఎశ్రీవం) ఎంపిక చేయనున్నారు.ఇలా ఎంపికైన జట్లకు ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్లు నిర్వహిస్తామని, అక్కడ కనబరిచే ప్రతిభ ఆధారంగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా జట్టును ఎంపిక చేస్తామని అసోసియేషన్ తెలిపింది.నెల రోజుల పాటు సాగే ఈ క్యాంప్లో పిల్లలకు క్రికెట్ మెలకువలు నేర్పించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# గద్వాల్ జిల్లాలో సీడ్ మాఫియా

**గద్వాల జిల్లా ప్రతినిధి మే19(ప్రభాత ఉదయం)**

గద్వాల్ సీడ్ అందరికి ఎందుకు అందడం లేదు... కొంత మంది ఆర్గనైజర్ లకే ఎందుకు... వారి స్పెషల్ ఏంటి..?

ప్రధాన కారణం డబ్బు...?

ఒక కంపెనీ వలన ఎవరెవరికి నష్టం ఎవరెవరికి లాభం డీటెయిల్ గా చెప్తాను

ధాన్య సీడ్ కంపెనీ తీసుకుందాం....ఒక ఎకరాకు 70000 అడ్వాన్స్ ఇస్తుంది ఇలా దాన్య సీడ్ ఈ సంవత్సరశీ పది వేల ఎకరాలకు ఇచ్చింది 2026-27 లో... ఒక్క ఎకరాకు రైతుకు 70 వేలు అడ్వాన్స్ ఇచ్చినప్పుడు పదివేల ఎకరాలకు 70కోట్లు అవుతుంది... 70కోట్ల రూపాయలకి రైతులు పది నెలలకు చెల్లించాల్సిన వడ్డీ 14 కోట్లు అవుతుంది.. ఈ 14కోట్లు నేరుగా ఆర్గనైజర్ అకౌంట్ కి వెళు ంది... ఒక్క ఎకరాకు ఒక రైతు 400 ప్యాకెట్లు గింజలు వొస్తాయి అలాగే పదివేల ఎకరాలకు 40 లక్షల ప్యాకెట్లు వస్తున్నాయి. ఒక్క ప్యాకెట్ ధర 550 రూపాయలు వేసుకుంటే 40 లక్షల ప్యాకెట్లకు 220 కోట్లు అవుతుంది.... ఈ 220 కోట్లు మార్చిలోపు ఆర్గనైజర్ రైతుకి చెల్లించాలి ఇప్పటి వరకు చెల్లించలేదు జూన్ లో చెల్లిస్తాడు అంటే ఈ మూడు నెలలకి 220 కోట్ల కి వడ్డీ 13 కోట్ల 20 లక్షలు నేరుగా ఆర్గనైజర్ అకౌంట్ కె వెళ్తుంది ఒక్క ప్యాకెట్ మీద 100 రూపాయలు కమిషన్ ఉంటుంది... 40 లక్షల ప్యాకెట్లకు ఒక ప్యాకెట్ మీద వంద రూపాయలు ఆర్గనైజర్ కు వెళ్తే కమిషన్ 40 కోట్లు అవుతుంది.... ఒక రైతు పత్తిని జిన్నింగ్ మిల్లు ఆడించడానికి ఒక్క ప్యాకెట్ కి అయ్యే ఖర్చు రెండు నుండి మూడు రూపాయలు ఖర్చు అవుతుంది అయితే ఒక ప్యాకెట్ కి 12 రూపాయలు వసూలు చేస్తున్నారు అయితే ఇక్కడ ఏడు నుంచి ఎనిమిది రూపాయలు ప్యాకెట్ మీద ఆర్గనైజర్కు వెళు తుంది..... మొత్తంగా ఒక టన్ను గింజలు మీద మిల్లు ఆడించడానికి మరియు కరెంటు బిల్లు మరియు లేబర్ ఖర్చు మొత్తం ఒక టన్నుకి 5000 నుంచి 6000 రూపాయలు ఖర్చు అవుతుంది.... కానీ ఆర్గనైజర్ వసూలు చేసేది ఒక టన్నుకి 13 వేల రూపాయలు.... ఒక ప్యాకెట్ కు 7 రూపాయలు వసూలు చేసినప్పుడు 40 లక్షల ప్యాకెట్లకు రెండు కోట్ల 80 లక్షలు ఆర్గనైజర్కు వెళుతుంది.... ఇందులో రైతుకి ఒక వేళ పంట నష్టం వస్తే ఆ భారం మొత్తం సబ్ ఆర్గనేజర్ మీద పడుతుంది ఆస్తులు అమ్మి ఐనా తాకట్టు పెట్టి ఆర్గనైజర్ కు చెల్లించాల్సిందే.... దూది తొక్కడానికి ఒక్క బోరెకి 150 రూపాయలు ఆర్గనైజర్ కె వెళ్తుంది మొత్తం ఆర్గనైజర్ లాభం ఒక కంపెనీ మీద 80కోట్లు లబ్ది పొందుతున్నాడు ఇలా ఒక గద్వాల్ లోనే 50 కి పైగా కంపెనీ లు ఉన్నాయి ఇంత లాభం వొచ్చాక ఆర్గనైజర్ కంపెనీ కి ముడుపులు చెల్లించి సీడ్ తెచ్చుకుంటున్నాడు కంపెనీ వాడు బాగానే ఆర్గనైజర్ బాగానే... ఇందులో రైతు అప్పు కట్టలేక ఆస్తులు అమ్ముకొని ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుంది ఇలా జరగకుండా ఉండాలంటే సీడ్ కంపెనీ ల మీద చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారికి సోషల్ మీడియా వేదిక ద్వారా తెలియజేయుచున్నాము =౧:ఒకరి ఇద్దరి ఆర్గనైజర్ లు కంపెనీ లని బెదిరించి సీడ్ తెచ్చుకుంటున్నారు=౧2024-25,2025-26 సంవత్సరం లో కూడా మార్చి లోపు అమౌంట్ జ్ఞుఖ఺ చెయ్యాలి ఐతే జూన్ లో చెల్లెస్తారు =౧ఇలా సీడ్ ఆర్గనైజర్ లు రైతు ల రక్తాన్ని తాగుతూ రైతులని దోపిడీ కి గురి చేస్తూ రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారురైతులనుంచి ఆర్గనైజర్ లు వడ్డీ వసూల్ చేస్తున్నారు.....సీడ్ ఆర్గనైజర్ ల దగ్గర కంపెనీ లు వడ్డీ వసూల్ చేస్తున్నాయా......?



# సిఎస్ డైరెక్టర్‌కు కవుల సన్మానం

**హైదరాబాద్, మే19 (ప్రభాత ఉదయం)**


పౌరసరఫరా శాఖ రాష్ట్ర సంచాలకులుగా ఇటీవల పదోన్నతి పొందిన జి.వి.శ్యాంప్రసాద్ లాల్ ను "కవి సాయంత్రం" కవులు ఘనంగా సన్మానించారు.ఈ మేరకు వారు నగరంలోని ఎర్రమంజిల్ లో గల పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో మంగళవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంచలంచలుగా పదోన్నతి పొందడం ఆయన క్రమశిక్షణకు, కార్యదీక్షకు నిదర్శనం అని అన్నారు. రానున్న కాలంలో వారు మరింత ఉన్నతంగా ఎదిగి మహోన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కవి సాయంత్రం గ్రూప్ అధ్యక్షులు ముక్కెర సంపత్ కుమార్, హైదరాబాద్ మహానగర పట్టణ అధ్యక్షురాలు బేతి కవిత, సినీగేకవి మౌనశ్రీ మల్లిక్, సీనియర్ పాత్రికేయులు బోయిన భాస్కర్, జలమండలి పిఆర్ఓ సుభాష్ చంద్రబోస్, కవులు దేవర కనకయ్య, వాసుదేవ, చేపూరి కుమార్, రవి ప్రసాద్ సాండేసరి, నూకల అశోక్ యాదవ్, పండరీనాథ్, అరుణోదయ నిర్మల, శ్రావ్య సాయి తదితరులు పాల్గొన్నారు.



# నల్లాకు అక్రమంగా బిగించిన మోటార్లు స్వాధీనం

**హైదరాబాద్, మే19(ప్రభాత ఉదయం)**

జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న మోటార్లు సీజ్ చేసారు. మంగళవారం రోజున ఉప్పల్ జోన్, డివిజన్-4, బోడుప్పల్ వార్డులో ఉన్న శ్రీలక్ష్మీ నగర్ కాలనీ, ప్రశాంత్ నగర్ పరిధిలో నల్లాకు బిగించిన మోటార్లను విజిలెన్సు అధికారులు నీటి సరఫరా సమయంలో పర్యటించి పైపులైనుకు అక్రమంగా బిగించిన 12 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.ఒకవేళ తక్కువ ప్రెజర్ తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.





# జలమండలిలో ఉద్యోగాలు.. అంటూ అసత్య ప్రచారం.

**జలమండలి క్లారిటీ- సోషల్ మీడియా పోస్టర్లపై అప్రమత్తంగా ఉండాలి**

**ప్రస్తుతం ఎలాంటి నియామకాలు లేవని స్పష్టం**

**ఉద్యోగ నియామకాలు ఉంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా అధికారిక సంస్థల ద్వారానే ప్రకటనలు విడుదల చేస్తామని వెల్లడి**

**హైదరాబ్, మే 19(ప్రభాత ఉదయం)**

ఇటీవల సోషల్ మీడియా వేదికగా "హైదరాబాద్ నీటి సరఫరా బోర్డు, తెలంగాణ రిక్రూట్మెంట్ 2026" పేరుతో ఒక పోస్టర్ వైరల్ అవుతోంది.ఆ పోస్టర్‌లో జలమండలిలో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు, వేతనాలు మరియు అర్హతల వివరాలు పేర్కొంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది.ఈ సందర్భంగా జలమండలి స్పష్టం చేయునది ఏమనగా...ప్రస్తుతం పోస్టర్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి నియామక ప్రక్రియను జలమండలి చేపట్టలేదు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న సమాచారం పూర్తిగా అసత్యం.. ఫేక్ న్యూస్.జలమండలిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి వచ్చిన సందర్భంలో, అవి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా సంబంధిత అధికారిక సంస్థల ద్వారా మాత్రమే నిర్వహించబడతాయి.ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటనలు ప్రభుత్వ, జలమండలి అధికారిక వెబ్‌సైట్లు, విశ్వసనీయ మీడియా వేదికల ద్వారా విడుదల చేయబడతాయి.కావున ప్రజలు, ఉద్యోగార్థులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిర్ధారణ లేని పోస్టర్లు, వార్తలు, తప్పుడు ప్రకటనలను నమ్మవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.అధికారిక సమాచారం కోసం మాత్రమే ప్రభుత్వ, జలమండలి అధికారిక ప్రకటనలను అనుసరించాలి.